www.kalamjyothi.com

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

మంగళవారం
27.10.2026



- తెలంగాణ ప్రతిపాదనకు ఫడ్నవీస్ సానుకూలత
- ఉమ్మడి అధ్యయనానికి అధికారుల కమిటీ
- రెండు లక్షల ఎకరాలకు సాగునీరు
- ఎల్లంపల్లికి నీటి తరలింపు మార్గం సులభం
- సీఎం రేవంత్ రెడ్డి

2 లో

తుమ్మిడిహెట్టి ఎత్తు పెంపు



తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 152 మీటర్లకు పెంచాలన్న తెలంగాణ ప్రతిపాదనపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతుల సాగునీటి కల నెరవేరే దిశగా అడుగులు పడ్డాయి. ముంబైలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందంతో సోమవారం జరిగిన భేటీలో ముంపు నష్టం లేకుండా రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అంశంపై చర్చించారు. ఎత్తు పెంపు, నీటి లభ్యత, సాంకేతిక అంశాల అధ్యయనానికి ఇరు రాష్ట్రాల అధికారుల సంయుక్త కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ముంపు భూములకు మహారాష్ట్ర నిబంధనల ప్రకారమే పూర్తి పరిహారం చెల్లిస్తామని తెలంగాణ స్పష్టం చేయడంతో ఎల్లంపల్లికి నీటి తరలింపు ప్రక్రియ వేగవంతమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

కలంజ్యోతి, హైదరాబాద్



2 లో

సిరిసిల్ల నా కులం.. తెలంగాణే గోత్రం

- సిరిసిల్ల ప్రజల ఆశీర్వాదమే బలం
- సిరిసిల్లతో విడదీయరాని అనుబంధం
- సీఎం రేవంత్‌రెడ్డి తీరు విచిత్రం
- కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షసాధింపు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

తెలంగాణ తన గోత్రమని, సిరిసిల్ల తన కులమని, రాజకీయ భిక్ష పెట్టిన ప్రజల ఆశీర్వాదంతోనే ఈ స్థాయికి ఎదిగానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భావోద్వేగానికి లోనయ్యారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో శ్రీగాధ గ్రామస్తులతో భేటీ అయిన ఆయన, అధికారంలో ఉన్నప్పుడు సిరిసిల్లను అభివృద్ధి చేశానని, ఇప్పుడు తనను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ అసమర్థ పాలనతో కరెంట్ కొరత వచ్చి పంటలు ఎండిపోతున్నాయని, కేసీఆర్‌పై కక్షతోనే కాళేశ్వరం ప్రాజెక్టును పడావుబెట్టి రైతులను సంక్షోభంలోకి నెట్టారని మండిపడ్డారు.



ఉగాండాలో ప్రపంచ రికార్డులు

ఉగాండాలోని కంపాలా వేదికగా టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించిన అపూర్వ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భారతీయ సనాతన ధర్మ వైభవం అంతర్జాతీయ స్థాయిలో ఘనంగా ఆవిష్కృతమైంది. అత్యధిక మంది భక్తులతో గోవింద తిలక ఆకృతి నిర్మాణం, సామూహిక నామస్మరణ, శ్రీ వేంకటేశ్వర స్వామి వేషధారణ ప్రదర్శనలతో ఒకే రోజు మూడు విభాగాల్లో గిన్నిస్ ప్రపంచ రికార్డులు సాధించి సరికొత్త చరిత్ర సృష్టించారు. విదేశీ గడ్డపై తెలుగు భక్తి సంప్రదాయాలను సగర్వంగా చాటిచెప్పిన ఈ మహత్తర ప్రయత్నం ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులకు గర్వకారణంగా నిలిచింది.

- కలంజ్యోతి, బ్యూరో



3 లో

- గోవింద తిలక ఆకృతి నిర్మాణం
- సామూహిక నామస్మరణ విశిష్టత
- వేంకటేశ్వర వేషధారణలో భక్తులు
- మూడు విభాగాల్లో గిన్నిస్ గుర్తింపు
- టీటీడీ ఉగాండా ఆధ్వర్యంలో కార్యక్రమం

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
2
మంగళవారం 27.10.2026
www.kalamjyothi.com

తుమ్మిడిహెట్టి ఎత్తు పెంపు



కలంజ్యోతి, హైదరాబాద్ (అక్టోబర్ 26) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతుల సాగునీటి కల నెరవేరే దిశగా కీలక ముందడుగు పడింది. ప్రాణహిత నదిపై నిర్మించతలపెట్టిన తుమ్మిడి హెట్టి బ్యారేజీ ఎత్తును 152 మీటర్లకు పెంచాల న్న తెలంగాణ ప్రతిపాదనపై మహారాష్ట్ర ముఖ్య మంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పం దించారు. ముంబైలోని సహ్యాద్రి అతిథిగృహం లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృ త్వంలోని బృందం సోమవారం ఫడ్నవీస్‌తో భేటీ అయింది. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్త మ్‌కుమార్‌రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో ఎత్తు పెంపు వల్ల మహారాష్ట్రకు ఎలాంటి నష్టం ఉండకూడదని స్పష్టం చేస్తూనే, తెలంగాణ నీటి అవసరాలకు సహకరించేందు కు అభ్యంతరం లేదని ఫడ్నవీస్ తెలిపారు. గతంలో కుదిరిన ఒప్పందం ప్రకారం బ్యారేజీ ఎత్తు 148 మీటర్లుగా ఉండగా, ఆ ఎత్తుతో ఆశించిన స్థాయిలో నీటిని తరలించడం సాధ్యం కాదని తెలంగాణ ప్రభుత్వం పేర్కొంది.

ఉమ్మడి అధ్యయనానికి అధికారుల కమిటీ..

బ్యారేజీ ఎత్తు పెంపుపై తుది నిర్ణయం తీసుకునే ముందు సమగ్ర అధ్యయనం అవసరమని ఇరు రాష్ట్రాలు నిర్ణయించాయి. బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యత, ముంపునకు గురయ్యే భూములు, ప్రభా విత ప్రాంతాలు, పరిహారం వంటి అంశాలపై రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ఫడ్నవీస్ ప్రతిపాదించా రు. అవసరమైతే ప్రత్యామ్నాయాలపై కూడా అధ్యయనం చేయాలని సూచించగా, కేంద్ర జల సంఘం సైతం తన పరిధిలోని సాంకేతిక అంశాలను పరిశీలించనుంది.

రెండు లక్షల ఎకరాలకు సాగునీరు..

తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సుమారు రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్నది ప్రభు త్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రె డ్డి వివరించారు. ముఖ్యంగా గిరిజన, అటవీ ప్రాంతాల్లో సాగు, తాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఈ ప్రాజెక్టు ఎంతో కీలకమని స్పష్టం చేశారు. బ్యారేజీ వల్ల మహారాష్ట్ర భూభాగంలో ముంపునకు గురయ్యే భూములకు అక్కడి నిబంధనల ప్రకారమే పూర్తి పరిహారం చెల్లిస్తామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు.

ఎల్లంపల్లికి నీటి తరలింపు మార్గం..

బ్యారేజీ ఎత్తు ఖరారైతే తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీటిని తరలించే మార్గం రూపకల్పన, భూసేకరణ వంటి ప్రక్రియలను వేగవంతం చేయాలని తెలంగాణ యోచి స్తోంది. ఇరు రాష్ట్రాల మధ్య చర్చలు ఎంతో సానుకూల వాతావరణంలో సాగినప్పటికీ, ప్రాజెక్టు నిర్మాణానికి తుది అనుమతి లభించి నట్లు ఇప్పుడే నిర్ధారించలేమని అధికారులు పేర్కొంటున్నారు. ఇరు రాష్ట్రాల అధికారుల కమిటీ నివేదిక, తదుపరి ఉన్నతస్థాయి చర్చల అనంతరమే ఈ ప్రతిపాదనపై పూర్తి స్పష్టత రానుంది.



బాధితులకు సత్వర న్యాయం

- సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయండి
- బాధితులకు భరోసా కల్పించండి
- జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 26) : ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, బాధితు లకు సత్వర న్యాయం అందించే లక్ష్యంతో ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో జి ల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీ దారుల నుంచి 21 ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికా రులతో ఫోన్లో మాట్లాడి, బాధితుల సమస్యల ను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాల ని ఆదేశాలు జారీ చేశారు.

బాధితులకు భరోసా కల్పించండి..

పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకం గా ప్రవర్తించి, క్షేత్రస్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం న్యాయం చేయాలని ఎస్పీ సూచించారు. తద్వారా బాధితులకు పోలీస్ శాఖపై నమ్మకం, భరోసా కలుగుతాయని పేర్కొన్నారు. గ్రీవెన్స్ డే లో అందిన అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ, వాటి పరిష్కార పురోగతిని నిరంతరం సమీక్షిస్తున్నామని తెలిపారు. బాధితులు నేరుగా అధికారుల దృష్టికి సమస్యలు తేవడం ద్వారా వేగంగా పరిష్కారం లభిస్తుందని స్పష్టం చేశారు.



సిరిసిల్ల నా కులం.. తెలంగాణే గోత్రం

కలంజ్యోతి, సిరిసిల్ల (అక్టోబర్ 26) : తెలంగాణ తన గోత్రమని, సిరిసిల్ల తన కులమని, రాజకీయ భిక్ష పెట్టిన సిరిసిల్ల ప్రజలను ఏనాటికీ మరువబోనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో తనను కలిసిన గంభీరావుపేట మండలం శ్రీగాధ గ్రామస్తులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసేవలో మంచి చేయడం తప్ప ఎవరికీ హాని తలపెట్టడం తనకు తెలియదని స్పష్టం చేశారు. స్వరాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని, ఆయన కుమారుడిగా ఎంతో గర్వపడుతున్నానని తెలిపారు. పార్టీ బాధ్యతల వల్ల నియోజకవర్గానికి రావడం కాస్త తగ్గినా, అధికారంలో ఉన్నప్పుడు సిరిసిల్లను అగ్రభాగాన నిలిపేలా అభివృద్ధి చేశానని, ఇప్పుడు తనను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉందని పేర్కొన్నారు. 2029లో కేసీఆర్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

సీఎం రేవంత్‌రెడ్డి తీరు విచిత్రం..

ఇటీవల సిరిసిల్లకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహరించిన తీరు అత్యంత హాస్యాస్పదంగా ఉందని కేటీఆర్ విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నిధులన్నీ సిరిసిల్లకే తరలిస్తున్నారని ఆరోపించిన రేవంత్, అధికారంలోకి వచ్చాక సిరిసిల్లలో ఏమీ అభివృద్ధి జరగలేదని మాట్లాడటం ఆయన ద్వంద్వ వైఖరికి నిదర్శనమని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు యూరియా అందక, రైతుబంధు జమకాక తీవ్ర అరిగోస పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో నెలకొన్న విద్యుత్ కొరత వల్ల పంటలు నిలువునా ఎండిపోతున్నాయని, ఈ దారుణ పరిస్థితులకు కరువు కారణం కాదని, ముమ్మాటికీ కాంగ్రెస్ అసమర్థ పాలనే కారణమని తీవ్రంగా దుయ్యబట్టారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షసాధింపు..

ప్రస్తుత తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో తెలంగాణకు కాళేశ్వరం ప్రాజెక్టు కల్పతరువు లాంటిదని కేటీఆర్ అభివర్ణించారు. కేసీఆర్‌పై ఉన్న రాజకీయ కక్షతోనే రేవంత్ సర్కారు కాళేశ్వరం ప్రాజెక్టును నిరుపయోగంగా మార్చి ప్రజలను తీవ్ర సంక్షోభంలోకి నెట్టిందని ఆరోపించారు. కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోయకపోవడం వల్ల విలువైన గోదావరి జలాలు దిగువకు తరలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 700 కిలోమీటర్ల దూరంలో ఉన్న కుప్పానికి నీటిని తరలిస్తుంటే, రేవంత్‌రెడ్డి మాత్రం 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న తన సొంత జిల్లాకు సైతం సాగునీరు అందించలేకపోతున్నారని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే మేల్కొని రైతులను ఆదుకోకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సమరశీల పోరాట కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు.

ఘనంగా గూడూరు సందీప్ జన్మదిన వేడుకలు

కలంజ్యోతి, నర్సంపేట (అక్టోబర్ 26) : బీజేపీ నర్సంపేట పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్ జన్మదినాన్ని పురస్క రించుకుని బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి ఆయనకు హృదయ పూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భం గా సందీప్‌తో కలిసి కేక్ కట్ చేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గూడూరు సందీప్ ఆయురారోగ్యాలతో, సుఖసంతో షాలతో నిండు నూరేళ్లు జీవించాలని, ప్రజాసేవలో అంకితభావంతో ముందుకు సాగుతూ పార్టీ బలోపే తానికి నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు పరస్పర గౌరవంతో సమన్వయంతో కలిసికట్టుగా పనిచేస్తూ ప్రజలకు చేరువ కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సందీప్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
3
మంగళవారం 27.10.2026
www.kalamjyothi.com



ఉగాండాలో ప్రపంచ రికార్డులు



కలంజ్యోతి, కంపాలా (అక్టోబర్ 25) : ఉగాండాలోని కిటెండేలో ఉన్న శ్రీ సప్తగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం (టీటీడీ ఉగాండా) ఆధ్వర్యంలో కంపాలాలోని ఎంటీఎన్ ఒమోండి స్టేడియం, లుగోగోలో అపూర్వమైన ఆధ్యాత్మిక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భారతీయ సనాతన ధర్మం, భక్తి సంప్రదాయాలు, శ్రీ వేంకటేశ్వర స్వామి వారి మహిమను ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పే లక్ష్యంతో ఈ వేడుకను చేపట్టారు. భక్తి, క్రమశిక్షణ, సామూహిక భాగస్వామ్యం కలగలిపిన ఈ మహత్తర ప్రయత్నం భారతీయ ఆధ్యాత్మిక వారసత్వాన్ని అంతర్జాతీయ వేదికపై నిలబెట్టింది.

గోవింద తిలక ఆకృతి నిర్మాణం..

మొదటి రికార్డు ప్రయత్నంగా అత్యధిక మంది భక్తులు కలిసి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి నామాన్ని ప్రతిబింబించే రీతిలో గోవింద తిలక ఆకారాన్ని అద్భుతంగా రూపొందించారు. భక్తుల సమన్వయం, సమష్టి కృషి, స్వామివారి పట్ల గల అచంచల విశ్వాసం ఈ ప్రత్యేక ప్రదర్శనలో స్పష్టంగా ప్రతిబింబించాయి. ఈ విశిష్ట రూపకల్పన ద్వారా గోవింద నామ ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను నిర్వాహకులు అంతర్జాతీయ సమాజానికి చాటిచెప్పారు.

సామూహిక నామస్మరణ విశిష్టత..

రెండవ రికార్డు ప్రయత్నంగా వేలాది మంది భక్తులు ఒకేచోట చేరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి గోవింద మంత్రాన్ని సామూహికంగా జపించారు. భక్తులందరూ ఏకగ్రీవంగా ఒకే స్వరంతో గోవింద నామస్మరణ చేయడంతో స్టేడియం ప్రాంగణమంతా ఆధ్యాత్మిక ఐక్యతతో మార్మోగింది. ఈ సామూహిక మంత్రోచ్చారణ భారతీయ భక్తి సంప్రదాయాల విశిష్టతను, గొప్పదనాన్ని కళ్లకు కట్టినట్లుగా ఆవిష్కరించింది.

వేంకటేశ్వర వేషధారణలో భక్తులు..

మూడవ రికార్డు ప్రయత్నంగా అత్యధిక సంఖ్యలో భక్తులు శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వేషధారణలో ఒకేచోట సమావేశమై స్వామివారి దివ్య రూపాన్ని ప్రదర్శించారు. స్వామివారి అలంకరణను ప్రతిబింబించే పవిత్ర వస్త్రధారణతో హాజరైన భక్తులు కార్యక్రమానికి ప్రత్యేక శోభను చేకూర్చారు. భిన్న ప్రాంతాలు, విభిన్న నేపథ్యాలకు చెందిన ప్రజలను ఒకే ఆధ్యాత్మిక భావనతో ఏకం చేసిన ఈ ప్రదర్శన అందరినీ విశేషంగా ఆకట్టుకుంది.

మూడు విభాగాల్లో గిన్నిస్ గుర్తింపు..

ఈ కార్యక్రమంలో నిర్వహించిన మూడు విభిన్న రికార్డు ప్రయత్నాలకు సంబంధించి అధికారికంగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సర్టిఫికెట్లు అందజేశారు. విదేశీ గడ్డపై తెలుగు భక్తి సంప్రదాయాలను, సనాతన ధర్మ వైభవాన్ని చాటిచెప్పిన ఈ విజయం ప్రపంచవ్యాప్తంగా ఉన్న వేంకటేశ్వర స్వామి భక్తులకు గర్వకారణంగా నిలిచింది. ఈ మహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఆలయ ట్రస్టీలు, నిర్వాహకులు, స్వచ్ఛంద సేవకులు, భారతీయ సమాజ ప్రతినిధులు, భక్తులందరికీ నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.











కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
మంగళవారం 27.10.2026
4
www.kalamjyothi.com

ప్రజావాణితో సమస్యల పరిష్కారం

- అర్జీలను సత్వరమే పరిష్కరించండి
- ప్రజావాణిని సద్వినియోగం చేసుకోండి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 26) : ప్రజావాణి ద్వారా ప్రజలు అందించే సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో (బడీఓసీ) సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి మొత్తం 163 అర్జీలను ఆమె స్వయంగా స్వీకరించారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో 4, వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో 5 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ పాల్గొన్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోండి..

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం కలెక్టరేట్, ఆర్డీఓ, అన్ని మండలాల ఎంపీడీఓ కార్యాలయాల్లో నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. మండలాల వారీగా బోయినపల్లిలో 4, ఇల్లంతకుంటలో 6, గంభీరావుపేటలో 2, కోనరావుపేటలో 3, ముస్తాబాద్‌లో 6, తంగళ్లపల్లిలో 1, వీర్నపల్లిలో 1, వేములవాడ అర్బన్‌లో 3, రూరల్‌లో 3, ఎల్లారెడ్డిపేటలో 2 దరఖాస్తులు రాగా, చందుర్తి, రుద్రంగి మండలాల్లో ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. స్థానిక ప్రజలు తమ సమస్యలపై ఇచ్చే అన్ని అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి పరిష్కరిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.



నీటిని, కరంటును పొదుపు చేయండి

- ఎల్ నినోపై అప్రమత్తత అవసరం
- తెలంగాణ సాంస్కృతిక సారథి టీం లీడర్ పడిదం రాజేందర్

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 26) : రానున్న రోజుల్లో ఎల్ నినో ప్రభావం పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు పూర్తి అప్రమత్తంగా వ్యవహరించాలని తెలంగాణ సాంస్కృతిక సారథి టీం లీడర్ పడిదం రాజేందర్ సూచించారు. జిల్లా కలెక్టర్, సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో సోమవారం చెన్నారావుపేట మండల కేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీలో కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిని వృథా చేయకుండా ప్రతి నీటి చుక్కను పొదుపు చేయాలని, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకొని భూగర్భ జలాలను పెంపొందించుకోవాలని కోరారు. నీరు మానవ మనుగడకు అత్యంత అవసరమని, భవిష్యత్ తరాల కోసం నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు.

విద్యుత్ వినియోగాన్ని పరిమితం చేయండి..

కళాకారులు తమ ఆటపాటలు, ప్రదర్శనల ద్వారా పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించారు. ఏసీలు, కూలర్లు, హీటర్ల వినియోగాన్ని అవసరమైన మేరకే పరిమితం చేసి విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని పాటల రూపంలో చైతన్యపరిచారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి టీం లీడర్ పడిదం రాజేందర్, తాళ్ల సునీల్, నెల్లూట్ల సుమన్, యోచన, గాదెపాక బాబు, బరిగల రవీందర్, కందగట్ల రామకృష్ణ, తాళ్లపెల్లి అశోక్, వాంకుడోత్ శ్రీలత, గుగులోతు సాలమ్మ తదితరులు పాల్గొన్నారు.



అగ్నిప్రమాదంలో దుకాణాలు దగ్ధం

- బాధితులకు తక్షణ పరిహారం అందించాలి
- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్

కలంజ్యోతి, నర్సంపేట (అక్టోబర్ 26) : నర్సంపేట పట్టణంలోని అంగడి సెంటర్ నెహ్రూ పార్క్ వద్ద షార్ట్ సర్క్యూట్ కారణంగా సంభవించిన అగ్నిప్రమాదంలో రెండు దుకాణాలు పూర్తిగా దగ్ధమై సుమారు రూ.25 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి సోమవారం ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితులను పరామర్శించారు. జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకుని బాధితులకు ధైర్యం చెప్పిన ఆయన, అధికారులతో ఫోన్లో మాట్లాడి సమగ్ర విచారణ జరిపించి ప్రభుత్వపరంగా తగిన పరిహారం అందజేయాలని కోరారు. ఆర్థికంగా నష్టపోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని, వారికి న్యాయం జరిగే వరకు బీజేపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్, రూరల్ అధ్యక్షుడు తనుగుల అంబేద్కర్, నియోజకవర్గ నాయకుడు జూలూరు మనీష్ గౌడ్, జిల్లా ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి వీరన్న, మాజీ ఎంపీటీసీ రాజు, సీనియర్ నాయకుడు దుగ్యాల సమ్మయ్య, యువ మోర్చా పట్టణ అధ్యక్షుడు గోస్కుల సందీప్ యాదవ్, యువ మోర్చా నాయకుడు కొంకీస విఘ్నేష్ గౌడ్, నర్సంపేట పట్టణ ప్రధాన కార్యదర్శి సూత్రపు సరిత, ఉపాధ్యక్షులు ఠాకూర్ విజయ్ సింగ్, కాసుల నాగేంద్రబాబు, చిలువేరు అన్వేష్, రాకేష్, అనిల్, అజీమ్, తరుణ్ సాయి తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వయోవృద్ధులకు రక్షణ కల్పించాలి

- సీనియర్ సిటిజన్ల భద్రతకు చర్యలు తీసుకోవాలి
- వయోవృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఈగ సత్యనారాయణ

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 26) : చెన్నారావుపేట మండల పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చిన సబ్‌ఇన్‌స్పెక్టర్ గోవర్ధన్‌ను మండల వయోవృద్ధుల సంక్షేమ సంఘం సభ్యులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు ఈగ సత్యనారాయణ మాట్లాడుతూ సమాజంలో వృద్ధులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను దృష్టిలో ఉంచుకొని వారికి తగిన చట్టబద్ధమైన రక్షణ కల్పించాలని కోరారు. సీనియర్ సిటిజన్ల హక్కులను పరిరక్షిస్తూ రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ ఎస్సైకి వినతిపత్రం అందజేశారు. అనంతరం సంఘం ప్రధాన కార్యదర్శి ములుక సాంబయ్య కవి తన కవితా సంకలన గ్రంథాన్ని ఎస్సై గోవర్ధన్‌కు బహూకరించారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యవర్గ సభ్యులు వరంగంటి మల్లయ్య, కుమార స్వామి, తాలపెల్లి నర్సయ్య, కంది నారాయణరెడ్డి, గట్ల కృష్ణ, ముత్యం సాంబయ్య, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం



కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 26) : డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టేందుకు మండల పరిధిలోని కిరాణా, పాన్ షాపులు, పాఠశాల ప్రాంతాలు, బస్టాండ్ పరిసరాల్లో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు నార్కోటిక్ జాగిలం సహాయంతో ముమ్మరంగా ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు, బ్యాగులను క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలకు విస్తృత అవగాహన కల్పించారు. జిల్లాలో మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీసులు నిరంతరం ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని, గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగంపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు చేరవేయాలని సూచించారు. ప్రజల సహకారంతోనే మత్తు పదార్థాల సంపూర్ణ నిర్మూలన, శాంతిభద్రతల పరిరక్షణ సాధ్యమవుతాయని ఎస్ఐ స్పష్టం చేశారు.



నర్సమ్మ కుటుంబానికి పరామర్శ

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 26) : చెన్నారావుపేట మండలం జల్లి గ్రామానికి చెందిన బిట్ల నర్సమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, సోమవారం నిర్వహించిన దశదిన కార్యక్రమానికి మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మరణించిన నర్సమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు బాదావత్ బాలు, చిలుపూరి వీరస్వామి, ఇళ్ల సునీల్, తుమ్మేటి సుభాష్, పింగిలి రజినీకాంత్ రెడ్డి, మేడే విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
5
మంగళవారం 27.10.2026
www.kalamjyothi.com

ఇందిరమ్మ ఇళ్లకుపైనల్‌బిల్లులు

- త్వరలోనే ఖాతాల్లో నగదు జమ
- రూ.40 వేల కోట్లతో ఇళ్ల నిర్మాణం
- తరువాతి విడతల్లోనూ అర్హులకు కేటాయింపు
- మంత్రి పొంగులేటి



కలంజ్యోతి, పాలేరు (అక్టోబర్ 26) : రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు ప్రభుత్వం శుభవార్త తెలిపింది. నిర్మాణం పూర్తిచేసుకుని తుది బిల్లుల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి త్వరలోనే ఆ మొత్తాన్ని జమ చేయనున్నట్లు రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. పాలేరు నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణం పూర్తయినా తుది బిల్లు అందలేదని లబ్ధిదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు.

రూ.40 వేల కోట్లతో ఇళ్ల నిర్మాణం..

రాష్ట్రంలోని నిరుపేదలకు పక్కా గృహాలు అందించాలనేసంకల్పంతోప్రభుత్వంఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని మంత్రి వివరించారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 8 లక్షల ఇళ్లను నిర్మించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున ప్రభుత్వం మొత్తం రూ.40 వేల కోట్ల భారీ బడ్జెట్‌ను కేటాయించిందని స్పష్టం చేశారు.

తరువాతి విడతల్లోనూ అర్హులకు కేటాయింపు..

మొదటి విడతలో ఇళ్లు మంజూరు కాని అర్హులైన పేదలెవరూ నిరాశ చెందవద్దని మంత్రి పొంగులేటి సూచించారు. ప్రభుత్వం దశలవారీగా ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తుందని, మూడు, నాలుగు విడతల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ తప్పకుండా ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రి చేసిన ఈ ప్రకటనతో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుని బిల్లుల కోసం వేచిచూస్తున్నవేలాది పేద కుటుంబాల్లో నూతనోత్సాహం వ్యక్తమవుతోంది.

ఎల్లమ్మ ఆలయానికి నిధులు మంజూరు

కేంద్రమంత్రికి కృతజ్ఞతలు

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 26) : మండలంలోని పదిర గ్రామంలో వెలసిన ఎల్లమ్మ తల్లి ఆలయం వద్ద షెడ్డు నిర్మాణానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రూ.5 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో చేపట్టనున్న నూతన షెడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ బోనాల మణెమ్మ సోమవారం కొబ్బరికాయ కొట్టి లాంఛనంగా ప్రారంభించారు. ఆలయానికి వచ్చే భక్తులకు, ఉత్సవాలు, ప్రత్యేక పూజలు నిర్వహించే సమయాల్లో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉపయోగపడేలా ఈ షెడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి తక్షణమే నిధులు కేటాయించడం పట్ల గ్రామస్తులు, గౌడ సంఘం శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు..

ఎల్లమ్మ తల్లి ఆలయ అభివృద్ధి కోసం రూ.5 లక్షల నిధులు మంజూరు చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు గౌడ సంఘం సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు రామచంద్రం, బుగ్గారెడ్డి, బోనాల సాయికుమార్, నరేష్, పరశురాం, గౌడ సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, వెంకటస్వామి, రంగయ్య, మల్లేశం, ఎల్లాగౌడ్, జవ్వాజి రాజు, పెద్ద మల్లేశం తదితర గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.





ఖర్గే దిష్టిబొమ్మ దహనం

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 26) : కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధానిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ బీజేవైఎం మండల శాఖ ఆధ్వర్యంలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. బహిరంగ సభలో ఓ సాధారణ పౌరుడు మాట్లాడినందుకు తీవ్ర అసహనంతో మల్లికార్జున ఖర్గే హద్దులు దాటి మాట్లాడటం అత్యంత అభ్యంతరకరమని నాయకులు మండిపడ్డారు. అంతేకాకుండా మీడియా కెమెరాల ముందే ఆ వ్యక్తిపై కాంగ్రెస్ శ్రేణులు దౌర్జన్యంగా దాడికి పాల్పడటం వారి దిగజారుడుతనానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. ప్రశ్నించిన వారిపై భౌతిక దాడులు చేయడం, అసభ్యకరంగా దూషించడమే రాహుల్ గాంధీ చెప్పుకునే ప్రేమ దుకాణం అసలు రూపమా అని నిలదీశారు.

ప్రధానిపై అనుచిత వ్యాఖ్యలు తగవు

ప్రజాస్వామ్యబద్ధంగా కోట్లాది మంది ప్రజల చేత ఎన్నుకోబడిన దేశ ప్రధానమంత్రిపై ఇలాంటి నీచమైన భాషను ఉపయోగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని నాయకులు హెచ్చరించారు. రాజకీయాల్లో భావజాల విభేదాలు సహజమని, రాజ్యాంగబద్ధ పదవిని, ప్రజా సంస్కారాన్ని ఇంత దారుణంగా కించపరచడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు మెరుగు జితేందర్ రెడ్డి, ఐటీ ఇన్‌చార్జ్ ప్రకాష్, దండు నవీన్, బాలకృష్ణ, ఓరగంటి చందు, పరశురామ్, సుజీత్, సన్నీ, నవనీత్, చరణ్, జస్వంత్, సుశాంత్, నాయకులు కిరణ్ నాయక్, శాగ లక్ష్మణ్, వంగలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటల సాగు చేయాలి

వ్యవసాయ అధికారి గోపాల్‌రెడ్డి



కలంజ్యోతి, చెన్నారావుపేట : అమీనాబాద్ గ్రామంలో నిర్వహించిన ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో ఎల్‌నినో ప్రభావం, ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. రాబోయే యాసంగిలో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వరికి బదులుగా పప్పుదినుసులు, నూనెగింజల వంటి ఆరుతడి పంటలు సాగు చేయాలని, జీరో టిల్లేజ్ వరి విధానాన్ని అనుసరిస్తూ విద్యుత్‌ను ఆదా చేయాలని మండల వ్యవసాయ అధికారి గోపాల్‌రెడ్డి సూచించారు. పంట అవశేషాలను తగులబెట్టకుండా భూమిలో కలియదున్నాలని, ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలు, పంట కుంటలు నిర్మించుకొని భూగర్భ జలాలను సంరక్షించుకోవాలని ఎంపీడీవో శివానంద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దార రంజిత్, ఉపసర్పంచ్ బండి హరీష్, మండల వ్యవసాయ అధికారి గోపాల్‌రెడ్డి, హార్టికల్చర్ అధికారి తరుణ్, వెటర్నరీ వైద్యుడు వెంకటరాజు, పీఏసీఎస్ చైర్మన్ ఎం. వెంకటరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ ఎస్. రమేష్, ఆర్ఐ మమత, పంచాయతీ కార్యదర్శి బి. సుమలత, వ్యవసాయ విస్తరణ అధికారి కిరణ్మయి, జీపీఓ రాజు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

కలం జ్యోతి
తెలుగు దినపత్రిక

జీవితాంతం గుర్తుండిపోయే

జ్ఞాపకాలు

విక్టరీ వెంకటేష్, శ్రీనిధి శెట్టి జంటగా మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కిన లేటెస్ట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఆదర్శకుటుంబం చిత్ర ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో కథానాయిక శ్రీనిధి శెట్టి పలు ఆసక్తికర విశేషాలను పంచుకున్నారు. ఈ సినిమాలో జీవితాంతం గుర్తుండిపోయే మంచి జ్ఞాపకాలు దక్కాయని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. తన కెరీర్‌లోనే మొదటిసారి పూర్తిస్థాయి డార్క్ హ్యూమర్ కలగలిసిన కామెడీ రోల్ చేశానని, లెజెండరీ నటుడు వెంకటేష్ కామెడీ టైమింగ్, భావోద్వేగాలకు దీటుగా నటించడం గొప్ప అనుభవమని పేర్కొన్నారు. త్రివిక్రమ్ తనకు ఈ పాత్రను ఇవ్వడం, వెంకీ-త్రివిక్రమ్ కాంబోలో భాగమవ్వడం అదృష్టమని తెలిపారు. ఎన్నో సర్‌ప్రైజులతో కూడిన ఈ భారీ చిత్రం అక్టోబర్ 30న ప్రేక్షకుల ముందుకు రానుండగా, ప్రేక్షకులు ఎంతగానో ఎంజాయ్ చేస్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.



Printed and Published by PENDYALA JYOTHI on behalf of PENDYALA JYOTHI, Printed at Rudra Kakatiya Printers and Graphics H.no.183/85/12/38, Somidi Road, Kazipet, Warangal, 506003., Published at H.No. 30/1/426, Madikonda, Kazipet, Hanumakonda District. Telangana, 506142, Editor : RAMESH PENDYALA. Ph : 9494 009 003.